
బుధవారం
11-09-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1, సంచిక: 452 పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

# మోడీపై నాకు ఎలాంటి ద్వేషం లేదు

## రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు



**ముందడుగు జాతీయం:**

ప్రధానమంత్రి నరేంద్రమోడీపై తనకు ఏలాంటి ద్వేషం లేదని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్.. అక్కడ ప్రవాస భారతీయులతో సమావేశమవుతున్నారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మోడీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.


అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో గల జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులతో జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో రాహుల్ మాట్లాడుతూ.. 'ఈ విషయం చెప్తే మీరు ఆశ్చర్యపోతారు. ప్రధాని మోదీపై నాకు ఎలాంటి ద్వేషం లేదు. ఆయన అభిప్రాయాలు వేరు. దానికి నేను ఏకీభవించలేను. అంతేకానీ, నేను ఆయన్ని ద్వేషించట్లేదు. శత్రువుగానూ చూడట్లేదు. ప్రధాని చేసే పనుల పట్ల నాకు సానుకూలత ఉంది. అలాఅని, అవి మంచి ఫలితాలను ఇస్తాయని నేను అనుకోవట్లేదు. మా ఇద్దరి అభిప్రాయాలూ వేర్వేరు' అని రాహుల్ చెప్పుకొచ్చారు.

### సిక్కు వర్గంలో రాహుల్

# అసత్య ప్రచారం

## రాహుల్ గాంధీ వ్యాఖ్యలను ఖండించిన బిజెపి

రాహుల్ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ ఆగ్రహం



**ముందడుగు జాతీయం:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్‌లో రాజకీయాల కంటే మత స్వేచ్ఛపైనే పోరాటం కొనసాగుతోందని చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగింది. ఈ సందర్భంగా ఓ వర్గాన్ని ప్రస్తావించడం ఇందుకు కారణమైంది. సున్నితమైన అంశాలపై మాట్లాడుతూ ప్రమాదకర వాతావరణాన్ని సృష్టించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని బిజెపి మండిపడింది. విదేశాల్లో నివసిస్తున్న సిక్కు వర్గంలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. రాహుల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. చరిత్రలో మా వర్గం ఒక్కసారైనా ఆందోళన, అభద్రత, అస్తిత్వ ముప్పు ఎదుర్కొన్నదంటే.. అది కేవలం గాంధీ కుటుంబం అధికారంలో ఉన్న సమయంలోనే. ఇళ్ల నుంచి అమాయకులను బయటకు తీసుకువచ్చి.. టైర్లు వేసి సజీవ దహనం చేశారు. నాటి దాడుల్లో 3 వేల మంది ప్రాణాలు కోల్పోయారు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

### ఉగ్ర నిందితుడు రషీద్‌కు

# మధ్యంతర బెయిల్

## ఎన్నికల ప్రచారం నిమిత్తం మంజూరు

**ముందడుగు జాతీయం:**

త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఉగ్రనిధుల కేసు నిందితుడు, లోక్‌సభ ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్‌కు కోర్టులో ఊరట లభించింది. ఆయనకు మంగళవారం ఢిల్లీ కోర్టు ఎన్నికల ప్రచారం నిమిత్తం బెయిల్ మంజూరు చేసింది. దాని గడువు అక్టోబర్ రెండుకు పూర్తికానుంది. మిగతా 2లో








### సుప్రీంకోర్టు ఆదేశించినా..

# ఆగని ఆందోళనలు


## న్యాయం జరిగేసరికి విధుల్లోకి చేరేది లేదు

నిరసనలు కొనసాగుతాయన్న వైద్యులు 02



కోచింగ్ సెంటర్లపై తనకు నమ్మకం లేదు

మిగతా 2లో



దేశంలో నెల రోజుల్లో 18 రైలు ప్రమాదాలు

మిగతా 2లో



వాయుసేనలో మహిళా అధికారిపై లైంగిక వేధింపులు

మిగతా 3లో




మరో నాలుగు మెడికల్ కాలేజీలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..!

మిగతా 4లో

ముందడుగు
బుధవారం, 11-09-2024, హైదరాబాద్

# కోచింగ్ సెంటర్లపై తనకు నమ్మకం లేదు

## ఇన్ఫోసిస్ నారాయణమూర్తి కీలక వ్యాఖ్యలు

ముందడుగు జాతీయం:

కోచింగ్ సెంటర్లపై తనకు నమ్మకం లేదని, క్లాస్ రూంలో టీచర్లు చెప్పే పాఠాలపై శ్రద్ధ పెట్టని వారికే కోచింగ్ క్లాసులు అవసరమని కోచింగ్ క్లాసెస్‌పై ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో జరిగిన ఓ పుస్తకావిష్కరణలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐఐటీలు, నీట్ వంటి కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు ఏ విధంగా ఉపయోపడతాయి..? అనే ప్రశ్నకు నారాయణ మూర్తి ఈ విధంగా స్పందించారు. 'కోచింగ్ సెంటర్లపై నాకు నమ్మకం లేదు. కోచింగ్ క్లాసులకు వెళ్ళే చాలా మంది విద్యార్థులు స్కూల్లో టీచర్లు చెప్పే పాఠాలను జాగ్రత్తగా విననివారే. లేదంటే తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువులో సాయం చేయలేని స్థితిలో ఉండి ఉంటారు. అలాంటి వాళ్లే కోచింగ్ సెంటర్ల వైపు మొగ్గుచూపుతారు. పిల్లలు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి ఈ



కోచింగ్ సెంటర్లు తప్పుడు మార్గంగా నిలుస్తున్నాయి' అని నారాయణమూర్తి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఎలా నేర్చుకోవాలో తెలుసుకోవడమే అసలైన విద్యావిధానమని ఈ సందర్భంగా నారాయణమూర్తి అన్నారు. దురదృష్టవశాత్తు మన దేశంలో ఐటీ చదువులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. దీని వల్ల విద్యార్థుల్లో ఆలోచించే శక్తి ఉండటం లేదన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు చదువుకోవడానికి ఇంట్లో క్రమశిక్షణతో కూడిన వాతావరణాన్ని కల్పించాలన్నారు. తల్లిదండ్రులు కూడా పుస్తకాలు పట్టుకుని చదివితే వారిని చూసి పిల్లలకి కూడా చదువుకోవాలన్న ఆసక్తి కలుగుతుందని వివరించారు.

## సుప్రీంకోర్టు ఆదేశించినా..

# ఆగని ఆందోళనలు

ముందడుగు జాతీయం:

పశ్చిమబెంగాల్ కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలికి న్యాయం చేయాలని వైద్యులు నిరసనలు కొనసాగుతున్నాయి. నిరసన చేస్తున్న వైద్యులు నేటి సాయంత్రంలోగా విధుల్లో చేరాలని సుప్రీం కోర్టు ఆదేశించినా.. ఇంకా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకు విధుల్లో చేరే ప్రసక్తేలేదంటూ వైద్యులు చెబుతున్నారు. మా డిమాండ్లు నెరవేరేంత వరకు ఈ నిరసనలు కొనసాగుతూనే ఉంటాయి. కోల్‌కతా పోలీస్ కమిషనర్, ఆరోగ్య కార్యదర్శి, హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్, వైద్య విద్య డైరెక్టర్‌లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాము.

బాధితురాలికి న్యాయం జరిగేంత వరకు ఈ ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయి" అని వైద్యులు తేల్చి చెప్పారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా హత్యాచార ఘటనపై ఇటీవల విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. పశ్చిమ బెంగాల్ ఆరోగ్య శాఖ సమర్పించిన నివేదికను పరిశీలించిన సంగతి తెలిసిందే.

## ఉగ్ర నిందితుడు రషీద్‌కు

# మధ్యంతర బెయిల్

ముందడుగు జాతీయం:

ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చారన్న అభియోగాలపై 2019 ఆగస్టులో ఇంజినీర్ రషీద్ అరెస్టయ్యారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలోని తిహార్ జైల్లో ఉన్నారు. సెప్టెంబర్ 18 నుంచి మూడు దశల్లో అక్టోబర్ ఒకటి వరకు జరగనున్న జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం బెయిల్ ఇవ్వాలని రషీద్ చేసిన అభ్యర్థనకు కోర్టు సానుకూలంగా స్పందించింది. ఆయన లంగేట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2008, 2014లో విజయం సాధించారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు.


## దేశంలో నెల రోజుల్లో

# 18 రైలు ప్రమాదాలు

**అజ్మీర్‌లో ఒక్కరోజే రెండు సంఘటనలు ▪ ఉత్తరప్రదేశ్‌లోనే ఎక్కువ రైలు ప్రమాదాలు**

ముందడుగు జాతీయం:

దేశంలో రైలు ప్రమాదాలు, రైలు ప్రయాణీకులకు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక రాష్ట్రంలో రైలు ప్రమాదాలకు కుట్ర పన్నుతున్న ఘటనలు గత కొన్ని రోజులుగా పెరిగాయి. మొన్నటికి మొన్న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రైలు పట్టాలపై సిలిండర్ పెట్టి రైలును పట్టాలు తప్పించేందుకు దుండగులు యత్నించారు. ఈ ఘటన మరవక ముందే అలాంటి ఘటనే ఇవాళ మరొకటి చోటు చేసుకుంది. రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో రైలు ప్రమాదానికి దుండగులు భారీ కుట్ర పన్నినట్లు తెలిసింది. ఫులేరా – అహ్మదాబాద్ రూట్‌లో రైలు ట్రాక్‌పై దుండగులు సుమారు 70 కేజీల బరువైన సిమెంట్ దిమ్మెను ఉంచారు. రైలు దాన్ని ఢీ కొట్టి ముందుకు దూ




సుకెళ్లింది. అయితే అదృష్టవశాత్తూ ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఈ క్రమంలో వరుస రైలు ప్రమాదాలపై భారతీయ రైల్వే తాజాగా స్పందించింది. గత నెల ఆగస్టు నుంచి ఈ నెల 8వ తేదీ వరకూ 18 ఘటనలు చోటు చేసుకున్నట్లు తెలిపింది. ఇందులో అజ్మీర్‌లో ఆదివారం ఒక్కరోజే రెండు ఘటనలు చోటు చేసుకున్నట్లు పేర్కొంది. రైళ్లను పట్టాలు తప్పించేందుకే ఈ కుట్రలు జరిగాయని పేర్కొంది. ఈ 18 ఘటనల్లో 15 ప్రమాదాలు ఆగస్టులో జరగ్గా.. మరో మూడు ఈ నెల (సెప్టెంబర్‌లో) జరిగినట్లు వివరించింది. రైలు ట్రాక్‌లపై వివిధ రకాల వస్తువులను అధికారులు గుర్తించినట్లు తెలిపింది. వీటిలో ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ట్రాక్టర్లు, ఇనుప రాడ్‌లు, సిమెంట్ దిమ్మెలు ఉన్నాయి. ఇలాంటి ఘటనలు ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌లోనే వెలుగు చూసినట్లు తెలిపింది. ఆ తర్వాత పంజాబ్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ప్రమాదాలు జరిగినట్లు వివరించింది. ఇక జూన్ 2023 నుంచి ఇప్పటి వరకూ ఈ తరహా ఘటనలు 24 జరిగినట్లు తెలిపింది.

# వినేశ్ పోగట్‌పై యోగేశ్ బైరాగీ పోటీ

## రెండో జాబితా విడుదల చేసిన బీజేపీ





ముందడుగు హర్యానా:

దేశంలో జరుగుతున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన రెండో జాబితాను బీజేపీ పార్టీ మంగళవారం విడుదల చేసింది. ఒలింపిక్ రెజ్లర్ వినేశ్ పోగట్‌కు వ్యతిరేకంగా.. బీజేపీ తరపు నుంచి కెప్టెన్ యోగేశ్ బైరాగీ పోటీపడనున్నారు. కొన్ని రోజుల క్రితం వినేశ్ ఫోగట్.. కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. జులానా నియోజకవర్గం నుంచి వినేశ్ పోటీలో ఉన్నారు. ఇవాళ 21 మంది అభ్యర్థుల పేర్లతో బీజేపీ రెండో లిస్టును రిలీజ్ చేసింది. భారతీయ జనతా యువ మోర్చ ఉపాధ్యక్షుడిగా బైరాగి కొనసాగుతున్నారు. బీజేపీ స్పోర్ట్స్ సెల్ కో కన్వీనర్‌గా కూడా ఆయన ఉన్నారు. ఆ రాష్ట్రంలో ప్రజల పక్షాన ఆయన పోరాటం చేస్తున్నారు. అథ్లెట్ల హక్కుల కోసం పోరాడుతున్న వినేశ్ ఫోగట్.. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ముందడుగు
బుధవారం, 11-09-2024, హైదరాబాద్

## వాయుసేనలో మహిళా అధికారిపై
# లైంగిక వేధింపులు
### వింగ్ కమాండర్‌పై కేసు నమోదు



ముందడుగు జాతీయం:

భారత వాయుసేనలో మహిళా అధికారిపై లైంగిక వేధింపుల కేసు కలకలం సృష్టించింది. గత రెండు సంవత్సరాలుగా వింగ్ కమాండర్ తనను మానసికంగా వేధించడంతోపాటు అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళా అధికారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై బుద్గాం స్టేషన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఇద్దరు ఆఫీసర్లు శ్రీనగర్ బేస్‌లోనే పనిచేస్తున్నట్లు తెలిసింది. వింగ్ కమాండర్‌గా పనిచేస్తున్న అధికారి డిసెంబర్ 31, 2023న తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పోలీసు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. అసహజ శృంగారంలో పాల్గొనాలని బలవంతం చేస్తున్నాడని పేర్కొంది. గత రెండేళ్లుగా లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నాడని తెలిపింది. ఈ కేసు విచారణలో బుద్గాం పోలీసులకు వాయుసేన సహకరిస్తున్నట్లు సమాచారం.

## సింగపూర్‌లో లిక్విడ్ గ్రూప్‌తో
# ఫోన్‌పే భాగస్వామ్య ఒప్పందం

ముందడుగు హైదరాబాద్:



సింగపూర్‌లో తన మర్చంట్ స్వీకరణ నెట్‌వర్క్‌ను విస్తరించే క్రమంలో డిజిటల్ దేశాంతర పేమెంట్ సొల్యూషన్స్‌లో అగ్రగామి ఫిన్‌టెక్ సంస్థగా ఉన్న లిక్విడ్ గ్రూప్‌తో తాము భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నామని ఫోన్‌పే నేడు ప్రకటించింది. ఈ భాగస్వామ్యం భారతీయ సందర్శకుల పాపులర్ విహార కేంద్రమైన సింగపూర్‌లో విస్తారంగా ఉన్న లిక్విడ్ గ్రూప్ మర్చంట్ల వద్ద యూజర్లు తమ ఫోన్‌పే యాప్‌ను ఉపయోగించుకుని, స్కాన్ చేసి, పే చేసేందుకు పర్యాటకులకు వీలు కల్పిస్తుంది. ఈ క్యూఆర్ కోడ్లు చాంగి ఎయిర్ పోర్ట్, డ్యూటీ ఫ్రీ షాపులు, రెస్టారెంట్లు, బార్లు, ది కోకో కోలా ట్రీస్, ఛార్లెస్ & కీత్, లువెనస్ జ్యూవలరీ, హార్డ్ రాక్ కేఫ్ లాంటి రీటైలర్లు, సైట్ సీయింగ్ (సందర్శనా) ప్రదేశాలు, ట్రాన్స్ పోర్ట్ సర్వీసులు లాంటి వాటిలో విస్తారంగా అందుబాటులో ఉంటాయి. ఎన్ పిసిఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ తో లిక్విడ్ గ్రూప్ కుదుర్చుకున్న భాగస్వామ్యం ద్వారా ఈ భాగస్వామ్య ఒప్పందం జరిగింది. ఈ భాగస్వామ్యం ద్వారా, లిక్విడ్ గ్రూప్ యూపీఐను పేమెంట్ పద్ధతిగా అంగీకరించేందుకు తన మర్చంట్లకు వీలు కల్పించింది.



## ఎందరో మహానుభావులుని ప్రసారం చేస్తున్న
# టాటా ప్లే తెలుగు క్లాసిక్స్

ముందడుగు హైదరాబాద్:

తెలుగు సినిమా ప్రేమికుల హృదయాన్ని, ఆత్మను అలరించేందుకు విలక్షణమైన, సరికొత్త సెలబ్రిటీ టాక్ షో, 'ఎందరో మహానుభావులు' కార్యక్రమాన్ని టాటా ప్లే తెలుగు క్లాసిక్స్ ప్రసారం చేస్తోంది. నటుడు, రచయిత, దర్శకుడు పరుచూరి గోపాల కృష్ణ, జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీత నటి శారద, నటుడు, నిర్మాత, రాజకీయ నాయకుడు మురళీ మోహన్, దర్శకుడు, సినీ కథా రచయిత రేలంగి నరసింహారావు, తనికెళ్ల భరణి వంటి తెలుగు ఇండస్ట్రీ ప్రముఖులు, దిగ్గజాలు తమ వృత్తి జీవిత ప్రయాణాన్ని ఈ చాట్‌షోలో వీక్షించవచ్చు. ఈ చాట్ షోకు తొమ్మిది సార్లు నంది అవార్డులు, రెండు సార్లు ఫిలింఫేర్ అవార్డ్స్ సౌత్ విజేత, ప్రతిభావంతురాలు, ప్రముఖ తెలుగు నేపథ్య గాయని, డబ్బింగ్ కళాకారిణి సునీత ఉపద్రష్ట వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. విలక్షణమైన ఈ కార్యక్రమంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని ప్రముఖులు తమ నైపుణ్యాలు, అనుభవాలు, జీవితంలోని ఎత్తుపల్లాల గురించి మాట్లాడతారు. ప్రయాణంలో ఉన్నప్పుడు కూడా వీక్షకులు టాటా ప్లే మొబైల్ యాప్‌లో ప్రసారమైన అన్ని ఎపిసోడ్‌లను వీక్షించవచ్చు.

## ఆర్టీసీపై రుణభారాన్ని
# తగ్గించాలి

ముందడుగు హైదరాబాద్:

టీజీఎస్ఆర్టీసీపై క్రమంగా రుణభారాన్ని తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించా రు. నూతన బస్సుల కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఆర్టీసీ అధికారులతో సీఎం స మీక్ష సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం ద్వారా 83.42 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, మహిళా ప్రయాణికులకు రూ.2,840.71 కోట్లు ఆదా అయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. అనంతరం వివిధ బ్యాంకులు, ఉద్యోగుల భవిష్య నిధి ఖాతా నుంచి వాడుకున్న నిధులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కలిపి రూ.6,322 కోట్ల రుణాలు ఉన్నట్టు అధికారులు సీఎంకు వివరించారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, సీఎం కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసీం, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పాల్గొన్నారు.

## డివోర్స్ పేరిట
# ఒక కొత్త పెర్‌ఫ్యూమ్
### దుబాయ్ యువరాణి షేక్ మహ్రా ప్రకటన

ముందడుగు జాతీయం:





దుబాయి యువరాణి విడాకుల ప్రకటనతో అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా మరో పోస్టు చేశారు. సొంత బ్రాండ్ కింద పెర్ఫ్యూమ్‌ను ఆవిష్కరించారు. దానికి ఆమె పెట్టిన పేరు నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఇంతకీ విషయం ఏంటంటే..? తాను 'డివోర్స్' పేరిట ఒక కొత్త పెర్‌ఫ్యూమ్‌ను తీసుకొస్తున్నట్లు యువరాణి షేక్ మహ్రా ఇన్‌స్టాగ్రాం వేదికగా ప్రకటించారు. సొంత బ్రాండ్ 'మహ్రా ఎమ్1' కింద దానిని త్వరలో మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఆ దృశ్యాలను షేర్ చేశారు. అయితే పెర్‌ఫ్యూమ్ విలువ ఎంతో తెలియాల్సి ఉంది. ఇదిలాఉంటే.. ఆమె కొన్ని నెలల క్రితమే తన భర్త నుంచి విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

ముందడుగు
బుధవారం, 11-09-2024, హైదరాబాద్

ఈవేస్ట్ జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆల్ ఇండియా

# కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్




ముందడుగు హైదరాబాద్:

ఆల్ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మరియు ఒప్పో ఇండియా, నేడు జాతీయ స్థాయిలో ఎలక్ట్రానిక్‌వ్యర్థాలపై అవగాహన డ్రైవ్ (ఇవేస్ట్)తో 'జనరేషన్ గ్రీన్' క్యాంపెయిన్ రెండవ విడతను ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని రామ్‌జాస్ కళాశాలలో ప్రారంభించాయి. దీనితో, ఈ కళాశాల మొదటి 'ఎకోకాన్షియస్ ఛాంపియన్ ఇన్‌స్టిట్యూట్'గా నిలిచింది. మొదటి దశలో భాగంగా, ఒప్పో ఇండియా మరియు ఏఐసిటిఈ భారతదేశంలోని కళాశాలల్లో ఇంటర్న్‌షిప్‌లను అందించడం ద్వారా యువతలో హరిత నైపుణ్యాలను ప్రోత్సహించాయి. ఈ ఇంటర్న్‌షిప్‌ల కోసం 1,400 సంస్థల నుంచి 9,000 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 5,000 మంది ఎంపికయ్యారు. రెండవ దశలో విస్మరించిన వైర్లు, మొబైల్ ఫోన్‌లు, ఛార్జర్‌లు, బ్యాటరీలు తదితర ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణలో పెరుగుతున్న సవాళ్లు, స్థిరమైన భవిష్యత్తు కోసం సమర్థవంతంగా వ్యర్థాల నిర్వహణ గురించి యువతకు అవగాహన కల్పిస్తుంది. నేషనల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఫోరమ్ చైర్‌పర్సన్ డాక్టర్ అనిల్ సహస్రబుధే ముఖ్య అతిథిగా ప్రారంభోత్సవ వేడుకకు హాజరయ్యారు.

'గ్యారెంటీ'లు అమలు చేయలేక

# గంజాయి సాగా..?

## కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్



ముందడుగు హైదరాబాద్:

గ్యారెంటీల ప్రభావంతో ఆర్థిక కష్టాల్లో కూరుకుపోతున్న హిమాచల్ ప్రదేశ్‌ను బయటకు తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. హిమాచల్‌లో గంజాయి సాగుకు అనుమతించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గ్యారెంటీలు అమలు చేయలేక గంజాయి సాగా..? ఇంతకన్నా సిగ్గుమాలిన చర్య ఇంకోటి ఉంటదా? అని కేటీఆర్ మండిపడ్డారు. ఇదేనా మీ పార్టీ జాతీయ విధానం అని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు.

మరో నాలుగు మెడికల్ కాలేజీలకు

# కేంద్రం గ్రీన్ సిగ్నల్..!

ముందడుగు జాతీయం:




యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలకు కేంద్ర ఆరోగ్యశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ దరఖాస్తు చేసిన నాలుగు కాలేజీలకు పర్మిషన్ ఇవ్వాలని నేషనల్ మెడికల్ కమిషన్‌ను ఆదేశించింది. ఇదే విషయాన్ని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం లేఖ పంపింది. ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, మొత్తం 200 సీట్లు ఈ కాలేజీల్లో అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే ములుగు, నర్సంపేట్, గద్వాల్, నారాయణపేట్ మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. మొత్తం ఎనిమిది కాలేజీల్లో కలిపి 400 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దాంతో ప్రభుత్వ కాలేజీల్లో మొత్తం సీట్ల సంఖ్య 4090కి చేరింది.

ఈ ఏడాది ప్రభుత్వం ఎనిమిది కాలేజీలకు దరఖాస్తు చేసింది. జూన్‌లో ఈ కాలేజీల పరిశీలనకు వచ్చిన ఎన్ఎంసీ అధికారులు, ఇక్కడ కాలేజీల ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. టీచింగ్ స్టాఫ్, సౌకర్యాలు లేకుండా అనుమతులు ఇవ్వలేమన్నారు. అధికారులు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకురావడంతో, అవసరమైన నిధులను కొత్త సర్కార్ కేటాయించింది. ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను సవరించి ఫస్ట్ అప్పీల్‌కు వెళ్లింది.

ఈ అప్పీల్ తర్వాత ములుగు, నర్సంపేట, గద్వాల, నారాయణపేట కాలేజీలకు పర్మిషన్ ఇచ్చిన ఎన్ఎంసీ, మిగిలిన నాలుగు కాలేజీలకు అనుమతి ఇవ్వలేదు. ఈ కాలేజీల అనుమతులపై ఆరోగ్యశాఖ మానిటర్ చేసి, యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ కాలేజీలకు స్టాఫ్‌ను నియమించారు. ఇటీవల జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్‌లో మొదట ఆ నాలుగు కాలేజీల్లోని ఖాళీలను భర్తీ చేసి.. మిగతా కాలేజీల్లో స్టాఫ్‌ను బదిలీ చేశారు. ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు ఎలిజిబిలిటీ ఉన్న వారికి ప్రమోషన్లు ఇచ్చారు. కాలేజీ, హాస్పిటల్‌లో ఉండాల్సిన ల్యాబొరేటరీ, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించారు. ఇలా ఎన్ఎంసీ లేవనెత్తిన అన్ని లోపాలను సవరించి కేంద్ర ఆరోగ్యశాఖకు సెకండ్ అప్పీల్ చేశారు. సీఎం రేవంత్, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర ఆదేశాలతో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణి, ఇతర అధికారుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఆరోగ్యశాఖ, ఎన్ఎంసీ అధికారులను కలిశారు. కాలేజీల ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, ఇంకేమైనా అవసరం ఉంటే సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలోనే మొత్తం అన్ని కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయించింది. లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీచేయాలని ఎన్ఎంసీని ఆదేశించింది.

# గురుకులానికి ఫీవర్.. మూడు రోజులు సెలవులు



సిర్పూర్(టీ), ముందడుగు : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ)లోని సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాలకళాశాల జ్వరాలతో మంచం పట్టింది. దీంతో అధికారులు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి పిల్లలను ఇండ్లకు పంపిస్తున్నారు. ఇక్కడ 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాలుగు రోజుల క్రితం 30 మందికిపైగా జ్వరాల బారిన పడ్డారు. విడతల వారీగా పిల్లలను సిర్పూర్(టీ) సామాజిక దవాఖానకు తరలించినట్లు తెలుస్తున్నది. దవాఖానలో సరిపడా బెడ్లు లేక గురుకుల పాఠశాల నుంచి తెప్పించి మరీ వాటిపైనే విద్యార్థులకు చికిత్స అందించారు. మంగళవారం నాటికి 100 మందికి జ్వరాలు వచ్చినట్లు గుర్తించిన అధికారులు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించి విద్యార్థులను ఇండ్లకు పంపించారు. సిర్పూర్(టీ) సామాజిక దవాఖానలో చికిత్స పొందుతున్న 10 మంది (మంగళవారం ఉదయం వరకు) విద్యార్థులను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మంగళవారం పరామర్శించారు.

ముందడుగు
బుధవారం, 11-09-2024, హైదరాబాద్

# నా ఇంట్లో దొంగతనం చేశాడు..

## రాజ్‌తరుణ్-లావణ్య కేసులో మరో ట్విస్ట్



టాలీవుడ్ యాక్టర్ రాజ్‌తరుణ్ (Raj Tarun)లావణ్య (lavanya) కేసు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. వీరిద్దరి వ్యవహారంలో రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసుకు సంబంధించిన లావణ్య సమర్పించిన ఆధారాలతో.. ఇంటి వద్ద సాక్ష్యాలు సేకరించిన పోలీసులు రాజ్‌తరుణ్‌పై ఛార్జిషీట్ దాఖలు చేసి నిందితుడిగా చేర్చారు. మరోవైపు ఈ కేసులో రాజ్‌తరుణ్ ముందస్తు బెయిల్ కూడా తీసుకున్నాడు.

మరో ట్విస్ట్ నెలకొంది. రాజ్‌తరుణ్, మాల్వీ మల్హోత్రాపై పీఎస్‌లో లావణ్య నార్సింగి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. తన ఇంట్లో రూ.12 లక్షల విలువైన బంగారం చోరీ జరిగిందని.. బంగారం, పుస్తెలతాడు, తాళిబొట్టు రాజ్ తరుణ్ దొంగిలించాడని లావణ్య ఆరోపించింది. పెళ్లికి సంబంధించిన ఆధారాలు మాయం చేసేందుకు రాజ్ తరుణ్ ప్రయత్నించాడని ఆరోపించిన లావణ్య తాళితోపాటు డాక్యుమెంట్లు కూడా తీసుకెళ్లాడని ఫిర్యాదులో పేర్కొంది.

బంగారం కొనుగోలు చేసిన జ్యువెలరీ షాప్ బిల్స్‌తో సహా పీఎస్‌కు వచ్చిన లావణ్య.. తన నగలు బీరువాలో దాచానని, ఆ బీరువా తాళపు చెవి రాజ్ తరుణ్ దగ్గరే ఉన్నాయని, తనకు తెలియకుండా వాటిని దొంగిలించాడనేందుకు తన దగ్గర ఆధారాలున్నాయని లావణ్య చెప్పుకొచ్చింది.

రాజ్ తరుణ్‌లావణ్య కేసు వివరాలిలా..

రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మాల్వీ మల్హోత్రాతో ఎఫైర్ కారణంగా వదిలేసి వెళ్లిపోయాడని ఇప్పటికే నార్సింగి పోలీస్ స్టేషన్ లో రెండు సార్లు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. రాజ్‌తరుణ్‌తో తనకుకు పదేళ్ల క్రితమే పెళ్లయిందని.. పదేళ్లుగా తాము కాపురం చేస్తున్నామని పేర్కొన్న లావణ్య.. కొన్నాళ్ల క్రితం రాజ్‌తరుణ్ నాకు అబార్షన్ చేయించాడు. మెడికల్ రిపోర్ట్స్‌ను కూడా పోలీసులకు అందించానని చెప్పింది.

ఈ కేసులో పోలీసులు ముగ్గురిపై ఐపీసీ 420, 493, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నార్సింగి పోలీసులు ఏ1గా రాజ్ తరుణ్, ఏ2గా మాల్వీ మల్హోత్రా, ఏ3గా మయాంక్ మల్హోత్రాను చేర్చారు. 2008 నుంచి రాజ్‌తరుణ్‌కు లావణ్య పరిచయం ఉండగా.. రాజ్‌తరుణ్ 2010లో లావణ్యకు ప్రపోజ్ చేశాడు. రాజ్‌తరుణ్ 2014లో తనను పెళ్లి చేసుకున్నాడని లావణ్య చెప్పింది. అంతేకాదు రాజ్‌తరుణ్‌కు రూ.70 లక్షలు ఇచ్చామంది. 2016లో రాజ్‌తరుణ్ వల్ల గర్భవతిని అయ్యా. రెండో నెలలో నాకు సర్జరీ చేశారు.

ఆస్పత్రి బిల్లులు రాజ్‌తరుణే చెల్లించాడని చెప్పిన లావణ్య.. రాజ్‌తరుణ్, మాల్వీ నన్ను డ్రగ్స్ కేసులో ఇరికించారు. నన్ను మోసం చేసిన రాజ్‌తరుణ్‌పై చర్యలు తీసుకోవాలి. మాల్వీ, ఆమె సోదరుడు చంపుతామని బెదిరించారు. మాల్వీతోపాటు ఆమె సోదరుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు కోరింది.



# రక్తంతో సముద్రమే ఎరుపెక్కిన కథ..

## స్టన్నింగ్‌గా జూనియర్ ఎన్టీఆర్ దేవర పార్ట్ 1 ట్రైలర్

గ్లోబర్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ (Jr NTR) టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం దేవర (Devara). కొరటాల శివ (Siva Koratala) దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ రెండు పార్టులుగా రాబోతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో సందడి చేయనుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది మూవీ టీం.

అభిమానులు, మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ట్రైలర్ రానే వచ్చింది. అసలెవరు వాళ్లంతా.. కులం లేదు.. మతం లేదు.. భయమే లేదు.. ధైర్యం తప్ప ఏమీ తెలియని కళ్లల్లో మొదటిసారి భయం పొరలు కమ్ముకున్నాయంటూ బ్యాక్ గ్రౌండ్ వాయిస్‌తో సాగే సంభాషణలతో షురూ అయింది ట్రైలర్. ఎవరు చేశారిదంతా అంటుంటే.. చాలా పెద్ద కథ సామి.. రక్తంతో సముద్రమే ఎరుపెక్కిన కథ.. మా దేవర కథ.. అంటూ ప్రకాశ్ రాజ్ వాయిస్ ఓవర్‌తో సాగుతున్న డైలాగ్స్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. స్టన్నింగ్‌గా సాగుతున్న ట్రైలర్ తారక్ అభిమానులకు కావాల్సిన ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించనున్నట్టు చెప్పకనే చెబుతోంది.

దేవరలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర రోల్‌లో నటిస్తుండగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

ఈ చిత్రం ట్రైలర్ విడుదలకు ముందే అనార్త్ అమెరికా బాక్సాఫీస్ వద్ద ప్రీ సేల్స్‌లో రూ.8.2 కోట్ల మార్క్‌ను అధిగమించి అరుదైన ఫీట్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ట్రైలర్ విడుదలకు ముందే వేగంగా 1 మిలియన్ డాలర్ క్లబ్‌లోకి చేరిన తొలి ఇండియా సినిమాగా అరుదైన రికార్డు నమోదు చేసింది.